క్లుప్తంగా

ఉపాధ్యాయ ఖాళీల భర్తీ



జాయినింగ్ ఆర్డర్స్‌ను అందిస్తున్న ఎంఈఓ-1సామల సింహాచలం

బలిజిపేట: మండలంలో ఎస్జీటీ బదిలీల ప్రక్రియ పూర్తయి ఖాళీ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ పూర్తయిందని ఎంఈఓ-1సామల సింహాచలం తెలిపారు. మండలం నుంచి 23మంది వేరే మండలాలకు బదిలీపై వెళ్లినట్లు, అలాగే ఇతర మండలాల నుంచి 24మంది ఉపాధ్యాయులు ఈ మండలానికి బదిలపై వచ్చినట్లు చెప్పారు. మండల పరిధిలో అంతర్గతంగా 26మంది బదిలీ అయ్యారని మొత్తం మీద 50మంది ఉపాధ్యాయులు ఖాళీ పోస్టుల లో భర్తీ అయ్యారన్నారు. వాటికి సంబంధించిన ఉత్తర్వులను ఆయా ఉపాధ్యాయులకు అందించి, వచ్చిన వారిని జాయిన్ చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్రపై అవగాహన ర్యాలీ



పట్టణంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

పార్వతీపురంటౌన్: యోగాంధ్రలో భాగంగా పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా పలు యోగాసనాలు, విద్యార్థులతో అధ్యాపకులు వేయించారు. విద్యార్థుల శారీరక మానసిక ఆరోగ్యాల మెరుగుకు యోగా ఎంతగానో దోహదపడుతుందని, ప్రిన్సిపాల్ జె. రామారావు ఈ సందర్భంగా అన్నారు. ప్రతి విద్యార్థి యోగా కోసం కొంత సమయాన్ని కేటాయించాలని, దినచర్యగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆకుల రాజు, ఎన్ఎస్ఎస్ పీఓలు తెర్లి.రవికుమార్, ఎస్.శ్రీనివాసరావు, డీటీ నాయుడు అధ్యాపకులు, ప్రదీప్, లక్ష్మణరావు, రామకృష్ణ, శ్యామల రావు, తదితరులు పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి యోగాంధ్రకు ఆశ్రమ విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థినులతో డీడీ కృష్ణవేణి

సాలూరు రూరల్: మండలంలోని కురుకూటి గిరిజన బాలికల ఆశ్రమపాఠశాల విద్యార్థినులు అమరావతిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి యోగాంధ్రకు ఎంపికయ్యారు. ఈ నెల 9 నుంచి 14 వ తేదీవరకు జిల్లా కేంద్రం పార్వతీపురంలో జరిగిన యోగాంధ్ర పోటీలలో కురుకూటి ఆశ్రమ పాఠశాలకు చెందిన గెమ్మెల నవ్య, గెమ్మెల రమ్య, గెమ్మెల శ్రావణి, సీదరపు అంజలిలు ఎంపికయ్యారు. డిప్యూటీ డైరక్టర్ కృష్ణవేణి ఈ నలుగురు విద్యార్థినులను అమరావతి తీసుకువెళ్లారు.

సాగునీటి వనరులను గాలికొదిలేశారు

- సీపీఎం నాయకుడు పి.రాము



తుప్పలు, డొంకలతో రూపుమారిన చెరుకు మడి గెడ్డను చూపిస్తున్న సీపీఎం నాయకుడు పి.రాము

పార్వతీపురం రూరల్: సాగునీటిని అందించే వనరులను సంబంధిత అధికారులు, పాలకులు గాలికొదిలేశారని, వారి నిర్లక్ష్యంతో రైతులకు ఖరీఫ్ సీజన్‌కు కావాల్సిన సాగునీరు అందేందుకు కష్టతరమవుతుందని సీపీఎం నాయకుడు పి. రాము అన్నారు. ఈ మేరకు పార్వతీపురంలోని డోకిశీల పంచాయతీలో అనేక గిరిజనుల వ్యవసాయ భూములకు సాగునీరు అందించే గెడ్డలకు ఉపాధిహామీ పనులు చేపట్టి సిద్ధం చేయాలని విన్నవించినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా కేవలం ఫారంపాండ్స్ లాంటి పనులు మాత్రమే చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. మండలంలోరి తేలునాయుడువలస వరకు ఉన్న వ్యవసాయ భూములకు చెరుకు మడి గెడ్డ అనుసంధానంలో ఉన్న కాలువల ద్వారా దాదాపు 1500 ఎకరాల భూమికి సాగునీరు అందేదని..అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పుడు ఆ పరిస్థితి భిన్నంగా మారి దుస్థితి నెలకొన్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగునీటి వనరులను సక్రమంగా తీర్చిదిద్ది ఖరీఫ్ సీజన్‌కు కావాల్సిన నీటి నిల్వలు ఉండేలా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

కూటమి పాలనలో వెన్నుపోటు

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు
- కూటమి ఏడాది పాలనపై పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జోగారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు

పార్వతీపురంటౌన్: కూటమి పాలనలో ప్రజలకు పొడిచిన వెన్నుపోటే గుర్తుకు వస్తుందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన స్వగృహంలో కూటమి ఏడాది పాలనపై నియోజకవర్గ స్థాయిలో ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి వెన్నుపోటు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల కోసం బంగారు భవిష్యత్తు నిర్మిస్తే చంద్రబాబు పాలన వాటిని విధ్వంసం చేయడానికే పరిమితమైందన్నారు. గడిచిన ఏడాది పాలనా కాలంలో రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ఒక అరాచకాన్ని సృష్టించారన్నారు. గత వైఎస్ జగన్ పాలన అంటే నమ్మకం గుర్తుకు వస్తే, ఇప్పుడు చంద్రబాబు కూటమి పాలనలో ప్రజలకు పొడిచిన వెన్నుపోటే గుర్తుకు వస్తుందన్నారు. రాష్ట్రంలో ఏడాది కాలంగా వ్యవస్థల నిర్వీర్యం నుంచి ప్రజాస్వామ్య విధ్వంసం వరకు ఈ పుస్తకంలో ప్రతి అంశం పొందుపరిచినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో మూడు మండలాలు, పురపాలక సంఘం పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, పాలవలస మురళీకృష్ణ, బొంగు చిట్టి, కొండపల్లి బాలకృష్ణ, జెడ్పీటీసీలు అలజంగి రవి కుమార్, బలగ నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు సిద్ధా జగన్నాథం, బి.రవికుమార్, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, జిల్లా మేధావుల ఫోరం అధ్యక్షుడు పీఎస్ఆర్ నాయుడు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మడక విశ్వనాథం, రాష్ట్ర వ్యవసాయ అనుబంధ విభాగం కార్యదర్శి యాంద్రాపు తిరుపతి రావు, ప్రచార విభాగం కార్యదర్శి బి. వాసుదేవరావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు గొర్లి మాధవ రావు, ఐటీ విభాగం అధ్యక్షుడు ద్వారపురెడ్డి గణేష్, ఎంపీటీసీ బడే రామారావు, సర్పంచ్ చెరుకుబిల్లి బంగారమ్మ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి కాలువల షట్టర్స్ మార్చేదెప్పుడు?



డీఆర్‌ఓ హేమలతకు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు

పార్వతీపురం టౌన్: తోటపల్లి బ్యారేజీ వద్ద పాత కుడి, ఎడమ కాలువల షట్టర్స్ మార్చేదెప్పుడని ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పల నాయుడు ప్రశ్నించారు. ఆ మేరకు సోమవారం డీఆర్‌ఓ హేమలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటపల్లి బ్యారేజీ వద్ద కుడి, ఎడమ కాలువలకు ఉన్న పనిచేయని షట్టర్స్‌ను మార్చి కొత్తవి ఏర్పాటు చేసి ఈ ఖరీఫ్ సీజన్‌కు సాగునీటికి ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని కోరారు. సుమారు 32 వేల ఎకరాల ఆయకట్టు ఉన్న ఎడమ కాలువలో నేటికీ కొద్దిపాటి నీరు మాత్రమే ప్రవహిస్తోందని, దీనికి తోడు వర్షాలు కూడా పడుతుండడంతో ఆకుమడులు దున్ని ఆరబెట్టుకోవడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పంటకు కావాల్సిన నీరు రాక ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని, కావున తక్షణమే జల వనరుల శాఖ అధికారులపై ఒత్తిడి చేసి మరమ్మతులకు గురైన షట్టర్స్ స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేసి ఆయకట్టు పొలాలకు సాగునీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణ

మక్కువ: ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో ఎస్.సూర్య నారాయణ అన్నారు. ఈ మేరకు మక్కువ మండలంలోని అనసభద్ర గ్రామంలో ధర్తీ ఆబ జనభాగీదారి అభియాన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ఆధార్, రేషన్, పీఎంజేఏవై, కిసాన్ కార్డులతో పాటు, ప్రభుత్వ సేవలన్నీ తక్షణమే అందించనున్నామన్నారు. ఎవరికి ఎటువంటి ధ్రువపత్రాలు కావాలన్నా సమావేశంలోనే తక్షణమే అందించే లా చర్యలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మర్రి పారమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ, పంచాయతీ కార్యదర్శి రమేష్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు



బదిలీ ఉపాధ్యాయుల నుంచి జాయినింగ్ ఆర్డర్లు స్వీకరిస్తున్న ఎంఈఓలు సూరిదేముడు, వెంకటరమణ

సీతానగరం: విద్యాశాఖ ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ బదిలీల్లో సీతానగరం మండలానికి వచ్చిన ఉపాధ్యాయులను స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓ జి.సూరిదేముడు, ఎం.వెంకటరమణ సోమవారం విధుల్లో చేర్చుకున్నారు. ఈ మేరకు ఎంఈఓ సూరిదేముడు మాట్లాడుతూ సీతానగరం మండలానికి 16మంది బదిలీపై వచ్చారన్నారు. అలాగే సీతానగరం మండలంలోని వివిధ పాఠశాలల్లో విధులు నిర్వహించిన పాధ్యాయులు 27 మంది ఇతర మండలాలనుంచి వచ్చిన 10 మంది, ఉన్నత పాఠశాలల్లో క్లస్టర్ ఉపాధ్యాయులుగా 12 మంది విధుల్లో చేరినట్లు తెలియజేశారు. మండలంలోని 65 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్లు చెప్పారు. నూతనంగా బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులందరూ విద్యాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాలు యుటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు పి శ్రీనివాసరావు, బి.ప్రసాద రావు, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు పోల సత్యనారాయణ, పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి కె.అప్పడు దొర సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే జంక్షన్ వద్ద పొంచి ఉన్న ప్రమాదం



రహదారిపై శిథిలావస్థలో కల్వర్టు

సీతానగరం: పార్వతీపురం-విశాఖపట్నం జాతీయరహదారిలో నిరంతరం వందలాది మంది ప్రయాణికులు, వాహనాలు తిరుగాడే సీతానగరం రైల్వేస్టేషన్ జంక్షన్ సమీపంలో కల్వర్టు గోడలు కూలి ప్రమాదం పొంచి ఉందని తెలిసినా ఇంతవరకూ ఎవరూ పట్టించుకోలేదని వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. నిరంతరం వందలాది వాహనాలు తిరుగాడుతున్న కారణంగా కల్వర్టుగోడ, కల్వర్టు హెచ్చరిక ఆనవాళ్లు లేక ఇక్కడ తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాపోతున్నారు. ఈ రోడ్డుమీదుగా నిరంతరం ప్రజాప్రతినిదులు, ఉన్నతాధికారులు తిరుగాడుతున్నా కల్వర్టు విషయమై పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఎప్పుడు ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే శిథిలమైన కల్వర్టును పరిశీలించి నూతనంగా కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

స్పందించారు..తొలగించారు





విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలు తొలగించకముందు, తొలగించిన తరువాత

సాక్షి ఎఫెక్ట్...

పార్వతీపురం రూరల్: మండలంలోని వెంకంపేట గ్రామ శివాలయం వద్ద ఉన్న విద్యుత్ స్తంభానికి పచ్చని తీగలు కింది నుంచి పైనున్న విద్యుత్ సరఫరా తీగలకు అల్లుకున్నాయి. దీనిపై సోమవారం సాక్షిలో 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికన ప్రచురితమైన కథనం పట్ల విద్యుత్‌శాఖ సిబ్బంది స్పందించారు. ఈ మేరకు విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పచ్చని తీగలను తొలగించారు. విద్యుత్ సిబ్బంది స్పందనపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లాకేంద్రంలో దాహంకేకలు





కుళాయిల వద్ద మంచినీటి కోసం ఖాళీ బిందెలతో నిరీక్షిస్తున్న పట్టణ ప్రజలు, (ఇన్‌సెట్లో) ట్యాంకు వద్ద మంచినీటి కోసం బారులు తీరిన మహిళలు

పార్వతీపురం రూరల్/పార్వతీపురం: జిల్లా కేంద్రం పార్వతీపురం మున్సిపాల్టీ పరిధిలో ఉన్న పలు వార్డుల్లో గడిచిన ఆదివారం నుంచి మంచి నీటి సరఫరా లేక నీటి ఎద్దడితో తీవ్రస్థాయిలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులకు తాగునీటి సరఫరా కోసం విన్నవించినా ట్యాంకుల ద్వారా కూడా సక్రమంగా సరఫరా చేసే పరిస్థితి లేదని ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మంచినీటి కోసం పలు వార్డుల్లో కుళాయిల వద్ద నిరీక్షిస్తున్న, ట్యాంకుల వద్ద మంచినీటి కోసం బారులు తీరిన ప్రజల ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో సోమవారం చక్కర్లు కొట్టాయి. ఎన్నో ఏళ్ల కిందటి పరిస్థితి పునరావృతం అయ్యిందని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

అంటువ్యాధుల నివారణకు ముందు జాగ్రత్త చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: మండలంలో వర్షాలు కురుస్తున్న కారణంగా వచ్చే అంటు వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో సోమవారం డిప్యూటీ ఎంపీడీఓ కె.కుమారవర్మ అధ్యక్షతన సర్పంచ్‌లు, కార్యదర్శులతో అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన సదస్సు జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మార్గ దర్శకాలు విడుదల చేయడంతో సర్పంచ్‌ల సహకారంతో కార్యదర్శులు వీధుల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, తరచూ పారిశుధ్య పనులు చేపట్టాలని, క్లోరినేషన్ చేయించి, కాలువల్లో పూడికలు తీయించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే 6 గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టినా నిరంతర ప్రక్రియగా పనులు జరగాలని సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు త్వరలో విడుదల చేయనున్నట్లు తెలియజేశారు.

వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.కేవీఎస్ పద్మావతి



డోకిశీలలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ పద్మావతి

పార్వతీపురం రూరల్: వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందిని డిప్యూటీ డీఎంహెచ్ఓ కేవీఎస్ పద్మావతి ఆదేశించారు. ఈ మేరకు మండలంలోని డోకిశీల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.కేవీఎస్ పద్మావతి సోమవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఎనీమియా యాక్షన్ కమిటీ మీటింగ్ ప్రతి నెలా మొదటి బుధవారంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో ఉన్న ప్రతి సచివాలయంలో తప్పనిసరిగా జరిగేలా చూడాలని ఈ సందర్భంగా వైద్యులను ఆదేశించారు. ఈ క్రమంలో గర్భిణుల రిజిస్ట్రేషన్ సక్రమంగా చేయాలని అబా ఐడీ క్రియేట్ చేయాలని సూచించారు. నిర్దేశిత ఇండికేటర్స్ పక్కాగా అమలు చేయాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో జ్వరాలు ప్రబలకుండా అప్రమత్తంగా ఫీవర్ సర్వే చేపట్టాలని ఆదేశించారు. అనంతరం డీకెపట్నం హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను ఆమె సందర్శించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా.ఐశ్వర్య తదితర వైద్యసిబ్బంది ఉన్నారు.

మంచినీటి సరఫరా మెరుగుపరచాలి



డీఆర్‌ఓ హేమలతకు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

పార్వతీపురంటౌన్: మున్సిపాల్టీలో మంచినీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందని వారంలో ఒక రోజు కూడా మంచినీటిని సరఫరా చేయలేని దుస్థితిలో పాలకవర్గం, రాష్ట్ర ప్రభుత్వం ఉందని సీపీఎం పట్టణ కార్యదర్శి జి.వెంకటరమణ విమర్శించారు. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేసి అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి హేమలతకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 70 వేల మంది నివసిస్తున్న పార్వతీపురం మున్సిపాల్టీలో అనేక సంవత్సరాలుగా మంచినీటి సరఫరా వ్యవస్థ ధ్వంసమైందని, దీనిని మెరుగు పరచాల్సిన పాలకవర్గం, రాష్ట్రం ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు.

పార్వతీపురం పట్టణ మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం గత ప్రభుత్వం రూ.67 కోట్లు కేటాయించిందని కానీ ఆ పనులు అర్థాంతరంగా ఆగిపోవడంతో మంచినీటి సరఫరా సమస్య మొదటికి వచ్చిందన్నారు. మంచినీటి సరఫరా మెరుగు పరచకపోతే పెద్ద ఎత్తున మహిళలతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు బి.లక్ష్మి, జి.తులసి, గౌరమ్మ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై పెట్టిన కేసులు వెనక్కి తీసుకోవాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పార్వతీపురంటౌన్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై పెట్టిన కేసులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.అఖిల్, కె.రాజులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో400 ఎకరాల భూమిని తెలంగాణ ప్రభుత్వం, ఐటీ కంపెనీ పేరుతో నాశనం చేస్తోంది. యూనివర్సిటీ విద్యార్థులు దానిని వ్యతిరేకిస్తూ ధర్నా చేస్తుండగా విద్యార్థులపై కేసులు, అరెస్టులు, లాఠీ ఛార్జీ చేయడం అన్యాయమన్నారు. విద్యార్థులపై ప్రభుత్వ వైఖరి సరైనది కాదని, పెట్టిన కేసులను వెనక్కి తీసుకోవాలని, యూనివర్సిటీ విద్యార్థులకు మద్దతుగా పార్వతీపురంలో నిరసన చేశారు. కార్యక్రమంలో భాగంగా పాత బస్టాండ్ నుంచి ర్యాలీగా వచ్చి నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ కమిటీ సభ్యులు ఆదిత్య, అభి, సురేష్, మనీష, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వానంగా ప్రభుత్వ కార్యాలయాలకు మార్గం..!



దారిలో ఏర్పడిన గుంతలో నిల్వ ఉన్న వర్షపునీరు



అన్ని శాఖలకు వెళ్లేందుకు ముఖద్వారం వద్ద ఉన్న దారి

పార్వతీపురం రూరల్: ఈ ఫొటోల్లో కన్పిస్తున్న దారి ఏ గ్రామీణ ప్రాంతానికి చెందిన రహదారో లేదా యంత్రాలు వెళ్లలేని ప్రాంతాల్లో రోడ్డు వేయలేని కారణంగా ఉన్న ప్రాంతమోకాదు. సాక్షాత్తు జిల్లా స్థాయిలో పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన కార్యాలయాల సముదాయాలకు వెళ్లేందుకు ఉన్న రహదారి. ఇదే దారి గుండా ప్రతి రోజూ జిల్లా వైద్య శాఖ, విద్యాశాఖ, వ్యవసాయశాఖ, ఉపాధిహామీ, ఐసీడీఎస్, సాంఘిక సంక్షేమశాఖ, గృహ నిర్మాణశాఖ ఇలా చెప్పు కుంటూ పోతే దాదాపుగా 32 శాఖలకు సంబంధించిన జిల్లాస్థాయి అధికారుల కార్యాలయాలు ఇక్కడ ఉన్నాయి. గుంతలు ఏర్పడి వాటిలో వర్షపునీరు నిల్వవుండి ఇంత అధ్వానంగా ఉన్నా నిర్లక్ష్య చూపులతో బురదలోనే నడుచుకుంటూ, వాహనాలపై వెళ్లేవారే తప్ప పట్టించుకునాథులే కరువయ్యారు.



జిల్లా వైద్య, విద్య, ఉద్యాన కార్యాలయాలకు వెళ్లే ముఖద్వారం



ఉపాధి, డీఆర్‌డీఏ తదితర శాఖలకు వెళ్లేందుకు ఉన్న దారి